# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 154, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం -16 - ఆగష్టు - 2025


## ఎర్రకోట నుంచి పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్..!

### ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ప్రధాని మోదీ

**జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రధాని నరేంద్ర మోదీ**

**- 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగం**

**- ఎర్రకోటపై వరుసగా 12వ సారి జాతీయ జెండా ఆవిష్కరణ**

**- పాకిస్థాన్ అణు బెదిరింపులను సహించబోమంటూ తీవ్ర హెచ్చరిక**

**- సింధు జలాల ఒప్పందాన్ని భారత్ అంగీకరించబోదని స్పష్టీకరణ**

**- పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలోనే ఈ నిర్ణయమని వెల్లడి**

**- భారత రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్న ప్రధాని**



ఢిల్లీ: భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా జరుపుకుంటోంది. ఈ చారిత్రక వేడుకల సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాయుసేన హెలికాప్టర్లు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రత్యేక ప్రదర్శన ఇవ్వడం, వేదికపై పూల వర్షం కురిపించడం ఈ ఏడాది వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. శుక్రవారం ఉదయం సుమారు 7:30 గంటలకు ప్రధాని మోదీ ఎర్రకోటకు చేరుకున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర ఉన్నతాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. మిగతా..2లో

## జమ్మూకశ్మీర్ జల విషాదం.. 46కు చేరిన మృతుల సంఖ్య

- జమ్మూకశ్మీర్ కిష్ట్వార్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ ఆకస్మిక వరదలకు ఇద్దరు
- సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది సహా 46 మంది మృతి

శిథిలాల నుంచి 167 మందిని కాపాడిన సహాయక బృందాలు

- మచైల్ మాతా యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

రంగంలోకి దిగిన ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

- ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి



ఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. గురువారం మధ్యాహ్నం చషోతి గ్రామంలో మేఘవిస్ఫోటనం (క్లౌడ్ బరస్ట్) కారణంగా సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 46కు చేరింది. మృతుల్లో ఇద్దరు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్‌ఎఫ్) సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనతో ఏటా జరిగే మచైల్ మాతా యాత్రను అధికారులు తక్షణమే నిలిపివేశారు. మిగతా..2లో



2లో

## ఆంధ్రప్రదేశ్ కు అది డార్క్ సమయం.. వైసీపీ పాలనపై పవన్ విమర్శ

కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం

స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో కూటమి పాలన

వైసీపీ హయాంలో గొంతెత్తితే దాడులు జరిగేవని ఆరోపణ



2లో

## సామాన్యులకు 'డబుల్' దీపావళి కానుక..

**జీఎస్టీపై శుభవార్త చెప్పిన ప్రధాని మోదీ**

సామాన్యులు వాడే వస్తువులపై జీఎస్టీ భారీగా తగ్గింపు

ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ కీలక హామీ

నూతన తరం సంస్కరణల కోసం ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

పన్నుల భారం తగ్గించడమే లక్ష్యమని స్పష్టం చేసిన ప్రధాని

జీఎస్టీ రేట్ల సమీక్ష తక్షణ అవసరమని వ్యాఖ్య

## మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం...



2లో..

మహిళలతో కలిసి బస్సుల్లో ప్రయాణించిన చంద్రబాబు, పవన్, లోకేశ్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభం

'స్త్రీ శక్తి' పథకానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

ఉండవల్లి నుంచి విజయవాడ బస్టాండ్ వరకు సాగిన ప్రయాణం

## కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులపై రాజీ పడబోం

### బనకచర్లను నిర్మిస్తామన్న చంద్రబాబు...

ఈ అంశంపై రేవంత్ రెడ్డి స్పందన ఏమిటంటే..!

గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్లే రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆరోపణ

ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించి కేసీఆర్ తప్పు చేశారని విమర్శ

హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం మరోసారి రాజుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల ఎవరికీ నష్టం జరగదని... ఈ ప్రాజెక్టుపై ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని




ఈరోజు ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఈ అంశంపై ప్రతిస్పందించారు. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణకు ఉన్న హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను



కాపాడేందుకు ప్రతి నీటి చుక్క కోసం తమ ప్రభుత్వం పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. నదీ జలాల



2లో

## మోదీ, అమిత్ షాతో జగన్‌కే అసలైన హాట్‌లైన్ ఉంది

మోదీకి జగన్ దత్తపుత్రుడిలా మారారంటూ తీవ్ర విమర్శ

అసెంబ్లీకి వెళ్లరు, పార్లమెంటులో మాట్లాడరు అని ఫైర్

ప్రత్యేక హోదా, పోలవరంపై పోరాడే ధైర్యం లేదని ఎద్దేవా

మీదొక పార్టీ... మీరొక నాయకుడు!: జగన్ హాట్‌లైన్ వ్యాఖ్యలపై షర్మిల ఫైర్

## ట్రంప్-పుతిన్ భేటీకి ముందు.. భారత్‌కు అమెరికా వార్నింగ్

రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై భారత్‌కు అమెరికా హెచ్చరిక

ట్రంప్-పుతిన్ భేటీ విఫలమైతే టారిఫ్‌లు మరింత పెంచే అవకాశమున్న యూఎస్ ట్రెజరీ సెక్రటరీ

ఇప్పటికే భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధించిన అమెరికా

యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వ్యాఖ్యలపై శశి థరూర్ ఘాటు స్పందన



### శ్రీశైలం, సాగర్, పులిచింతలలోకి

## కొనసాగుతున్న వరద కృష్ణమ్మ దూకుడు

వరద ఉధృతికి ప్రకాశం బ్యారేజీ వద్ద పరవళ్లు

**5.59** లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

రెండో ప్రమాద హెచ్చరిక జారీ



2లో

## వణికించిన క్లౌడ్ బరస్ట్..

ఇద్దరు సీఐఎస్‌ఎఫ్ జవాన్లతో సహా 46 మంది మృతి

160 మంది గాయపడ్డారు. 220 మందికి పైగా ఇప్పటికీ కనిపించడం లేదు

జమ్మూ కాశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలోని చోసిటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ విధ్వంసం



2లో

## 'ఆపరేషన్ సిందూర్' చరిత్రలో నిలిచిపోతుంది - రాష్ట్రపతి

దేశ భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను అధిగమించింది

మన రాజ్యాంగం ప్రపంచంలోని అనేక దేశాలకు ఆదర్శంగా నిలిచింది

దేశ భద్రత కోసం మన సైనికులు ఎలాంటి పరిస్థితులకు అయినా సిద్ధంగా ఉంటారు



## ఓట్ల చోరీపై ఇక ప్రత్యక్ష యుద్ధం: రాహుల్

దేశంలో ఓట్ల చోరీపై తమ ఆందోళన అనేది కేవలం రాజకీయ అంశం కాదు

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, 'ఒక్కరికి ఒక ఓటు'అనే విధానాన్ని కాపాడుకొనేందుకు జరుగుతున్న నిర్ణయాత్మక పోరాటం

'ఓటర్ అధికార్ యాత్ర'ద్వారా ఓట్ల చోరీపై బిహార్ గడ్డపైనుంచే ప్రత్యక్ష యుద్ధం ప్రారంభిస్తున్నాం




2లో

## కృష్ణా, గోదావరి జలాల్లో
# తెలంగాణ హక్కులపై రాజీ పడబోం

నదీ జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్లే తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించారని విమర్శించారు. అనాటి ప్రభుత్వ నిర్ణయాల కారణంగానే ఈరోజు తెలంగాణ సాగునీటి హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే తమకు అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన రేవంత్ రెడ్డి, పొరుగు రాష్ట్రంతో స్నేహపూర్వక సంబంధాలు కోరుకుంటామని, అయితే హక్కుల విషయానికి వస్తే మాత్రం వెనక్కి తగ్గేది లేదని గట్టిగా తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీకి తావులేదని ఆయన భరోసా ఇచ్చారు. నెహ్రూ నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరామ్ సాగర్ లతోనే మనకు నీళ్లు అందుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ అంటే ఒక బ్రాండ్ అని... ఈ బ్రాండ్ ను మరింత ముందుకు తీసుకెళతామని అన్నారు. ప్రపంచ సుందరీమణుల పోటీలను హైదరాబాద్ లో నిర్వహించామని... ఈ సందర్భంగా పోటీలకు వచ్చిన వారికి తెలంగాణ ప్రత్యేకతలను చూపించామని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన బయో ఏషియా సదస్సు ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని చెప్పారు. ఇక్కడి ఫార్మా కంపెనీలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు.

## ఆంధ్రప్రదేశ్ కు అది డార్క్ సమయం..
## వైసీపీ పాలనపై పవన్ విమర్శ

అమరావతి: 2019 నుంచి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ లో చీకటి పాలన కొనసాగిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. బ్రిటీష్ పాలన మాదిరిగా నాటి వైసీపీ పాలన సాగిందని అన్నారు. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడలో జరిగిన వేడుకల్లో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంతోమంది మహానుభావుల త్యాగఫలమే స్వాతంత్ర్యం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పెట్టుబడులు రావాలన్నా శాంతి భద్రతలు బలంగా ఉండాలని చెప్పారు. ప్రస్తుత రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా, నిర్భయంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వంలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

**గెలిస్తే న్యాయం.. ఓడిపోతే అన్యాయమా?**

ప్రతిపక్ష నాయకుల తీరు ఎన్నికల్లో గెలిచినప్పుడు ఒకలా, ఓటమి పాలైతే మరోలా ఉంటుందని పవన్ కల్యాణ్ విమర్శించారు. 'ఓడిపోతే ఓటు చోరీ అంటున్నారు.. గెలిచినప్పుడు ఒక న్యాయం.. ఓడినప్పుడు మరో న్యాయమా?' అని నిలదీశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఎవరైనా గొంతెత్తితే దాడులు జరిగేవని ఆరోపించారు. అవినీతికి అలవాటుపడిన వాళ్లు ఏమైనా చేస్తారు, ఎంతకైనా తెగిస్తారని పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం...

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్వయంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళల కోసం ఈ కీలక పథకం నేటి నుంచి అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం ఉండవల్లి నుంచి తాడేపల్లి, కనకదుర్గ వారధి మీదుగా విజయవాడ బస్ టెర్మినల్ వరకు చంద్రబాబు, పవన్, లోకేశ్ బస్సులోనే వెళ్లారు. వీరితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పలువురు ఇతర కూటమి నేతలు కూడా ఈ ప్రయాణంలో పాల్గొన్నారు. మహిళా ప్రయాణికులతో కలిసి ప్రయాణిస్తూ వారి సంతోషంలో పాలుపంచుకున్నారు. సీఎం, మంత్రులు ప్రయాణిస్తున్న బస్సు వెళ్లే మార్గంలో మహిళలు పెద్ద సంఖ్యలో గుమిగూడి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దారి పొడవునా మంగళహారతులతో నీరాజనాలు పలుకుతూ ఘన స్వాగతం పలికారు. 'థాంక్యూ సీఎం సర్' అంటూ నినాదాలతో తమ కృతజ్ఞతను తెలియజేశారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నేతలు పలుచోట్ల బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీలలో ఒకటైన ఈ పథకాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

## తవాంగ్‌లో అపూర్వ దృశ్యం..
## 14,000 అడుగుల ఎత్తున దేశభక్తి వెల్లువ

ఢిల్లీ: హిమాలయ పర్వత శిఖరాలు జాతీయ జెండాలోని మూడు రంగులతో నిండిపోయాయి. 14,000 అడుగుల ఎత్తులో సైనికులు, స్థానిక గిరిజనులు కలిసి 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని చేతబూని కదం తొక్కారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లా చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ అద్భుతమైన, అపూర్వమైన దృశ్యం ఆవిష్కృతమైంది. భారత సైన్యానికి చెందిన గజరాజ్ కార్ప్స్ ఈ తిరంగా యాత్రకు నేతృత్వం వహించింది. ఈ యాత్రలో 160 మంది సైనికులు, 25 మంది ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) సిబ్బందితో పాటు మాగో, చునా వంటి మారుమూల పల్లెల నుంచి సుమారు 150 మంది గ్రామస్థులు పాల్గొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ భుజం భుజం కలిపి నడవడంతో ఆ ప్రాంతమంతా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ వర్ణాలతో నిండిపోయింది. అసిస్టెంట్ కమిషనర్ ఛుటన్ వాంగ్చు నేతృత్వంలోని సివిల్ అడ్మినిస్ట్రేషన్ ఈ కార్యక్రమంలో గ్రామస్థులను భాగస్వాములను చేసింది. ఈ యాత్రలో వారణాసిలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టిబెటన్ స్టడీస్‌కు చెందిన 23 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు కూడా పాల్గొనడం విశేషం. ఈ భారీ ప్రదర్శన అనంతరం దేశభక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను కూడా ప్రదర్శించారు. యాత్రలో పాల్గొన్న సైనిక, పౌర విభాగాలు, గ్రామస్థులు కలిసి 'ప్లాస్టిక్ రహిత జోన్' పేరుతో పరిశుభ్రతా కార్యక్రమం చేపట్టారు. ఆ ప్రాంతంలోని వ్యర్థాలను తొలగించి, సున్నితమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంపై అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ హర్షం వ్యక్తం చేశారు. "శిఖరాగ్ర ప్రాంతంలో ఇదే నిజమైన భారత స్ఫూర్తి" అని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా మాగో, చునా గ్రామాల్లోని ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేసి స్థానికులు తమ దేశభక్తిని చాటుకున్నారు. స్వాతంత్ర్యం అనేది అందరి సమిష్టి బాధ్యత అని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది.

## ఎర్రకోట నుంచి పాకిస్థాన్‌కు
# ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్..!



రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర ఉన్నతాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం త్రివిధ దళాలు, ఢిల్లీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత, వాయుసేనకు చెందిన ఫ్లయింగ్ ఆఫీసర్ రషికా శర్మ సహాయంతో ప్రధాని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ గీతాలాపనతో ఆ ప్రాంతం మార్మోగగా, 21 తుపాకులతో గౌరవ వందనం సమర్పించారు. పతాకావిష్కరణ జరిగిన వెంటనే, భారత వాయుసేనకు చెందిన రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు ఆకాశంలో కనువిందు చేశాయి. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని ప్రదర్శించగా, మరొకటి 'ఆపరేషన్ సిందూర్' బ్యానర్‌ను ప్రదర్శిస్తూ వేదికపై పూల వర్షం కురిపించింది. సాయుధ దళాల త్యాగనిరతికి గుర్తుగా ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ ఎర్రకోట బురుజుల నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. ఇది ఆయనకు వరుసగా 12వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం కావడం విశేషం. ఈ వేడుకల్లో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు కూడా పాల్గొన్నారు. వీరంతా జ్ఞానపథ్ వద్ద 'నయా భారత్' లోగో ఆకారంలో కూర్చుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఎర్రకోట నుంచి పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్..!

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ, పొరుగుదేశం పాకిస్థాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పాకిస్థాన్ నుంచి వస్తున్న అణు బెదిరింపులను భారత్ ఎంతమాత్రం సహించబోదని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, దశాబ్దాలుగా అమల్లో ఉన్న సింధు జలాల ఒప్పందాన్ని ఇకపై భారత్ అంగీకరించబోదని సంచలన ప్రకటన చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటపై వరుసగా 12వ సారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రధాని మాట్లాడారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. "నీళ్లు, రక్తం ఎప్పటికీ కలిసి ప్రవహించవు" అని పునరుద్ఘాటించారు. మన దేశానికి చెందిన నీటిని పాకిస్థాన్‌తో పంచుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. "మన భూములు దాహంతో అల్లాడుతుంటే, శత్రువుల నేలలను తడపడానికి మన నీటిని వాడుకున్నారు. ఇకపై ఆ పరిస్థితి ఉండదు. భారతదేశానికి చెందిన నీటిపై మనకు, మన రైతులకు పూర్తి హక్కు ఉంటుంది. దేశ, రైతుల సంక్షేమం కోసం సింధు జలాల ఒప్పందాన్ని మేం అంగీకరించడం లేదు" అని ప్రధాని మోదీ ఎర్రకోట వేదికగా తేల్చిచెప్పారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం 140 కోట్ల మంది భారతీయుల సంకల్పాలకు ప్రతీక అని మోదీ అభివర్ణించారు. దేశం సాధించిన సమిష్టి విజయాలను చూసి గర్వపడాల్సిన తరుణమిదని అన్నారు. ఎడారులు, హిమాలయ శిఖరాలు, సముద్ర తీరాలు అనే తేడా లేకుండా దేశంలోని ప్రతి మూల నుంచి ఒకే నినాదం వినిపిస్తోందని, అదే ప్రాణం కంటే ప్రియమైన మాతృభూమి గీతమని పేర్కొన్నారు. గత 75 ఏళ్లుగా భారత రాజ్యాంగం మనకు మార్గనిర్దేశం చేస్తోందని గుర్తుచేశారు. "వికసిత భారత్" నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ మరింత కష్టపడి పనిచేయాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## సామాన్యులకు 'డబుల్' దీపావళి కానుక..
# జీఎస్టీపై శుభవార్త చెప్పిన ప్రధాని మోదీ

ఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఒక తీపి కబురు అందించారు. ఈ ఏడాది ప్రజలకు "డబుల్ దీపావళి" కానుక ఇవ్వబోతున్నట్లు ప్రకటించి, సామాన్యులపై పన్ను భారాన్ని తగ్గించే దిశగా కీలక హామీ ఇచ్చారు. ముఖ్యంగా నిత్యం ఇంట్లో వాడే వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ని భారీగా తగ్గించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ, "ఈ దీపావళికి నేను మీకు డబుల్ దీపావళిని జరిపించబోతున్నాను. దేశ ప్రజలకు ఒక పెద్ద బహుమతి అందబోతోంది. సాధారణ గృహ వినియోగ వస్తువులపై జీఎస్టీలో భారీ కోత ఉంటుంది" అని అన్నారు. ప్రస్తుతం ఉన్న జీఎస్టీ రేట్లను సమీక్షించడం తక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సామాన్యులపై పన్ను భారం తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త తరం జీఎస్టీ సంస్కరణలను సిద్ధం చేస్తోందని మోదీ వెల్లడించారు. ఇదే సందర్భంగా పాలన, పన్నుల విధానం, ప్రభుత్వ సేవల వంటి కీలక రంగాల్లో నూతన తరం సంస్కరణలను వేగవంతం చేసేందుకు ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ ప్రకటించారు. "మేము నెక్స్ట్-జనరేషన్ సంస్కరణల కోసం ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అన్ని రకాల సంస్కరణలను తీసుకురావడమే ఇప్పుడు మా లక్ష్యం" అని ఆయన తెలిపారు. భారతదేశంలో జీఎస్టీ విధానం అమలులోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2017లో ప్రారంభమైన జీఎస్టీ, దేశ పరోక్ష పన్నుల వ్యవస్థను ఏకీకృతం చేయడంలో కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ప్రతిపాదిత సంస్కరణలు పన్నుల విధానాన్ని మరింత సరళతరం చేసి, పారదర్శకతను పెంచుతాయని భావిస్తున్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన ఈ 'డబుల్' హామీతో, రాబోయే దీపావళి పండుగ నాటికి పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు వస్తాయోనని పౌరులు, వ్యాపార వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## ట్రంప్-పుతిన్ భేటీకి ముందు..
# భారత్‌కు అమెరికా వార్నింగ్

ఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జరపనున్న కీలక సమావేశం విఫలమైతే, భారత్‌పై సుంకాలను (టారిఫ్‌లను) మరింత పెంచుతామని యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ రోజు అలస్కాలో ట్రంప్, పుతిన్ మధ్య జరగనున్న ఈ భేటీపై ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. బ్లూమ్‌బర్గ్ టీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, "రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇప్పటికే భారతీయులపై ద్వితీయ శ్రేణి టారిఫ్‌లు విధించాం. చర్చలు సఫలం కాకపోతే, ఆంక్షలు లేదా సుంకాలు మరింత పెరిగే అవకాశం ఉంది" అని స్పష్టం చేశారు. రష్యా నుంచి ఆయుధాలు, చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై ఇప్పటికే 50 శాతం టారిఫ్‌లను విధించినట్లు ఆయన గుర్తుచేశారు. ఇందులో 25 శాతం సాధారణ సుంకం కాగా, మరో 25 శాతం జరిమానాగా విధించారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారత్, రష్యా నుంచి రాయితీ ధరలకు భారీగా చమురును దిగుమతి చేసుకుంటోంది. 2021లో కేవలం 3 శాతంగా ఉన్న ఈ దిగుమతులు, ప్రస్తుతం 35-40 శాతానికి చేరాయి. ఈ పరిణామం వాషింగ్టన్, న్యూఢిల్లీ మధ్య సంబంధాలలో కొంత ఒత్తిడికి కారణమవుతోంది. ఇక, అమెరికా చర్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. మరోవైపు, ఈ ఆంక్షల విషయంలో యూరప్ దేశాలు కూడా తమతో కలిసి రావాలని బెస్సెంట్ పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, బెస్సెంట్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. "అన్యాయానికి తలొగ్గడం కంటే, మొండిగా ఉండటమే మేలు" అని ఆయన వ్యాఖ్యానించారు.

## మోదీ, అమిత్ షాతో జగన్‌కే అసలైన హాట్‌లైన్ ఉంది

అమరావతి: వైసీపీ అధినేత జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, చంద్రబాబుకు మధ్య హాట్‌లైన్ ఉందంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. అసలైన హాట్‌లైన్ జగన్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మధ్యే ఉందని ఆమె ఎదురుదాడి చేశారు. మోదీకి దత్తపుత్రుడిగా మారి, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, కనీసం అసెంబ్లీకి వెళ్లి ప్రజల సమస్యలపై మాట్లాడే ధైర్యం కూడా జగన్‌కు లేదని ఆమె విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన షర్మిల, జగన్ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పచ్చకామెర్లు ఉన్నవారికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. తెరవెనుక రాజకీయాలు, పొత్తులు పెట్టుకోవడం జగన్‌కు అలవాటు కాబట్టే అందరూ అలాగే చేస్తారని అనుకుంటున్నారు. రాహుల్ గాంధీకి చంద్రబాబుతో ఎలాంటి హాట్‌లైన్ లేదు. ఈ హామీ మేము ఇవ్వగలం. మరి, మీకు మోదీ, అమిత్ షాలతో హాట్‌లైన్ లేదని బైబిల్‌పై ప్రమాణం చేసి చెప్పగలరా?" అని జగన్‌ను ఆమె నిలదీశారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ పూర్తిగా బీజేపీకి దాసోహమయ్యారని షర్మిల ఆరోపించారు. "మోదీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని అధికారంలోకి వచ్చిన మీరు, ఆ తర్వాత అదే మోదీకి ఎన్నోసార్లు సాగిలపడ్డారు. బీజేపీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బేషరతుగా మద్దతు ఇచ్చారు. గంగవరం పోర్టు వంటి ఎన్నో విలువైన ప్రాజెక్టులను మోదీ మనుషులకు కట్టబెట్టారు. చివరికి బీజేపీ నేతలకు ఎంపీ పదవులు కూడా ఇచ్చారు. దీన్ని అక్రమ పొత్తు అనాలా? లేక రాజకీయ వ్యభిచారం అనాలా?" అని ఆమె ప్రశ్నించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీజేపీని ఒక మతతత్వ పార్టీగా అభివర్ణిస్తూ అన్ని వేదికలపైనా తీవ్రంగా వ్యతిరేకించారని షర్మిల గుర్తుచేశారు. కానీ, ఆయన కొడుకునని చెప్పుకునే జగన్, అదే బీజేపీకి దత్తపుత్రుడిగా మారడం సిగ్గుచేటని విమర్శించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణికం ఠాగూర్‌ను 'ఎవడు వాడు' అన్నట్లుగా జగన్ మాట్లాడటం ఆయన సంస్కారహీనతకు నిదర్శనమని మండిపడ్డారు. "మోదీకి వ్యతిరేకంగా పోరాడే దమ్ము మీకుందా అని మాణికం ఠాగూర్ విసిరిన సవాలుకు ఇప్పటికీ సమాధానం చెప్పలేదు. మీకు దమ్ముంటే అసెంబ్లీకి వెళ్లి లిక్కర్ స్కామ్‌పై సంజాయిషీ ఇవ్వండి. నాసిరకం బ్రాండ్లకు ఎందుకు అనుమతి ఇచ్చారో, నగదు రూపంలోనే ఎందుకు అమ్మకాలు జరిపారో వివరించండి" అని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి వెళ్లే దమ్ము లేదని, పార్లమెంటుకు వెళ్లి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు ఎత్తు గురించి అడిగే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం అసెంబ్లీలో, దేశం కోసం పార్లమెంటులో పోరాడలేరు కానీ... మీదొక పార్టీ, మీరొక నాయకుడు... అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## విజయవాడలో పోలీసు వందనం
# స్వీకరించిన సీఎం చంద్రబాబు...



విజయవాడ: భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు విజయవాడలో అట్టహాసంగా జరిగాయి. నగరంలోని మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మువ్వన్నెల జెండాకు వందనం చేసి, పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్టేడియం అంతా పర్యటించిన ముఖ్యమంత్రి, పరేడ్‌లో పాల్గొన్న సాయుధ బలగాల కవాతును పరిశీలించారు. ఈ క్రమంలో ప్రజలకు, విద్యార్థులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోలీసు బెటాలియన్లు, ఎన్‌సీసీ విద్యార్థులు చేసిన కవాతు ఆకట్టుకుంది. స్వాతంత్ర్య వేడుకలను వీక్షించేందుకు నగర పౌరులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సహా పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వణికించిన క్లౌడ్ బరస్ట్..

ఢిల్లీ: జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని చోసిటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ విధ్వంసం సృష్టించింది. ఈ విపత్తులో ఇప్పటివరకు 46 మంది ప్రాణాలు కోల్పోయారు. 160 మంది గాయపడ్డారు. 220 మందికి పైగా ఇప్పటికీ కనిపించడం లేదు. మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ జవాన్లు కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అమిత్ షాకు పరిస్థితి గురించి తెలియజేశారు. శిథిలాల కింద లేదా ప్రమాదంలో చిక్కుకున్న ప్రతి ప్రాణాన్ని కాపాడటానికి సహాయ సిబ్బంది గంటల తరబడి కష్టపడి పనిచేస్తున్నారు. సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. కానీ, వర్షం, బురద సహాయక చర్యలకు అడ్డంకిగా మారుతున్నాయి. క్లౌడ్ బరస్ట్ తరువాత, తీవ్రమైన వరదలు విధ్వంసం సృష్టించాయి. విపత్తు జరిగిన ప్రదేశానికి సమీపంలో మృతదేహాలు పడి ఉన్నాయి. సైన్యం, పోలీసులు, స్థానిక ప్రజలు గాయపడిన వారిని బురదలోంచి తమ భుజాలపై మోసుకెళ్లి ఆసుపత్రికి తరలిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో బిజెపి నాయకుడు మరియు ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ వార్తా సంస్థ పిటిఐతో మాట్లాడుతూ చోసిటిలో పరిస్థితి చాలా దారుణంగా ఉందని అన్నారు. మచైల్ యాత్ర బేస్ క్యాంప్ అయిన చోసిటి చుట్టూ మృత్యువు విలయతాండవం చేస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## 'ఆపరేషన్ సిందూర్'
# చరిత్రలో నిలిచిపోతుంది - రాష్ట్రపతి
### దేశ భద్రతకు అత్యధిక ప్రాధాన్యత
### భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను అధిగమించింది

ఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను అధిగమించిందని ఆమె కొనియాడారు. మన రాజ్యాంగం ప్రపంచంలోని అనేక దేశాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ రక్షణ దళాల పోరాట పటిమను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశ భద్రత కోసం మన సైనికులు ఎలాంటి పరిస్థితులకు అయినా సిద్ధంగా ఉంటారని 'ఆపరేషన్ సిందూర్' మరోసారి రుజువు చేసిందని ఆమె అన్నారు.

'ఆపరేషన్ సిందూర్' చరిత్రలో నిలిచిపోతుంది

ఆపరేషన్ సిందూర్'ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఒక చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. ఆర్మీ జరిపిన ఈ పోరాటం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ దేశ రక్షణ దళాల ధైర్యసాహసాలకు, అంకితభావానికి ప్రతీకగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలొడ్డిన సైనికుల త్యాగాలను ఆమె స్మరించుకున్నారు.

దేశ భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

రాష్ట్రపతి తన ప్రసంగంలో దేశ భద్రతకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ వంటి విజయాలు భారత సాయుధ దళాల బలం, నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెబుతాయన్నారు. దేశ ప్రగతి, భద్రత ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని, ఈ రెండింటినీ ప్రభుత్వం సమర్థవంతంగా కొనసాగిస్తుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలంతా దేశ భద్రతకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

## ఓట్ల చోరీపై ఇక ప్రత్యక్ష యుద్ధం: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలో ఓట్ల చోరీపై తమ ఆందోళన అనేది కేవలం రాజకీయ అంశం కాదని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తే ల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, 'ఒక్కరికి ఒక ఓటు'అనే విధానాన్ని కాపాడుకొనేందుకు జరుగుతున్న నిర్ణయాత్మక పోరాటం అని స్పష్టంచేశారు. 'ఓటర్ అధికార్ యాత్ర'ద్వారా ఓట్ల చోరీపై బిహార్ గడ్డపైనుంచే ప్రత్యక్ష యుద్ధం ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశవ్యాప్తంగా స్వేచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా కోసం తమ పార్టీ పోరాడుతోందని ఉద్ఘాటించారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభమవుతుందని, యువత, కార్మికులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇదొ క ప్రజా ఉద్యమం అని పేర్కొన్నారు. ఓట్ల దొంగల ను ఎన్నికల్లో ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఓట్ల చోరు లు ఓడిపోతేనే ప్రజలకు, రాజ్యాంగానికి విజయం లభిస్తుందన్నారు. ఓటర్ అధికార్ యాత్రకు సంబంధించిన ఓ వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియాను షేర్ చేశారు.

## శ్రీశైలం, సాగర్, పులిచింతలలోకి
# కొనసాగుతున్న వరద
# కృష్ణమ్మ దూకుడు
### వరద ఉధృతికి ప్రకాశం బ్యారేజీ వద్ద పరవళ్లు

శ్రీశైలం ప్రాజెక్ట్ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదకు మూసీ, మున్నేరు, కట్టలేరు, బుడమేరు, కొండవీటివాగు ప్రవాహం తోడవడంతో కృష్ణా నదిలో వరద ఉధృతి మరింత పెరిగింది. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రకాశం బ్యారేజీలోకి 5,59,185 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 70 గేట్లు ఎత్తి 5,59,185 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో ఎగువన వర్షాలు కురుస్తుండటంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద కొనసాగుతోంది. ఆ రెండు జలాశయాలు నిండుకుండల్లా మారడంతో వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఉప నది భీమాపై మహారాష్ట్రలోని ఉజ్జయిని డ్యామ్ కూడా నిండింది. దాంతో కృష్ణా, భీమా వరద జూరాల మీదుగా శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రధాన ఉప నది తుంగభద్ర డ్యాం కూడా నిండిపోయి సుంకేశుల బ్యారేజీ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. దీంతో గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,72,234 క్యూసెక్కులు చేరుతుండగా.. నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,06,608 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,982 క్యూసెక్కులు.. వెరసి 1,72,590 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 1,72,774 క్యూసెక్కులు చేరుతుండగా.. స్పిలే వే గేట్లు ఎత్తి, విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 2,36,958 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీనికి మూసీ వరద తోడవుతుండటంతో పులిచింతల ప్రాజెక్టులోకి 2,73,900 క్యూసెక్కుల వరద చేరుతోంది. స్పిల్ వే గేట్ల ద్వారా 1,84,692 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ కృష్ణాలో వర్షాలు తగ్గిన నేపథ్యంలో శుక్రవారం ప్రకాశం బ్యారేజీ వద్ద వరద తగ్గుముఖం పడుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

## జమ్మూకశ్మీర్ జల విషాదం..
# 46కు చేరిన మృతుల సంఖ్య

మొదటి పేజి తరువాయి

ఈ ఘటనతో ఏటా జరిగే మచైల్ మాతా యాత్రను అధికారులు తక్షణమే నిలిపివేశారు. చషోతి గ్రామం ఈ యాత్రకు ప్రారంభ స్థానం కావడంతో పెను ప్రమాదం సంభవించింది. కుండపోత వర్షం కారణంగా ఒక్కసారిగా వచ్చిన వరద ప్రవాహానికి యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన శిబిరాలు, వాహనాలు కొట్టుకుపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే ఆర్మీకి చెందిన వైట్ నైట్ కార్ప్స్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు శిథిలాల కింద నుంచి 167 మందిని సురక్షితంగా బయటకు తీశారు. వీరిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని విధాలా సహాయం అందిస్తామని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హామీ ఇచ్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, తాను లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను హుటాహుటిన ఘటనా స్థలానికి పంపినట్లు పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఈ విషాదం నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించ తలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాలను, 'ఎట్ హోమ్' టీ పార్టీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా.. ఆర్మీ, పోలీసు, విపత్తు నిర్వహణ బృందాలను ఆదేశించారు. బాధితుల కుటుంబాలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యల్లో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## బనకచర్లపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు

అమరావతి: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం వాటిల్లదని ఆయన అన్నారు. బనకచర్లకు ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చే వరద నీటితో తాము నష్టాలను భరిస్తున్నామని... అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరం ఎందుకని తెలంగాణ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ ప్రశ్నించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చంద్రబాబు ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సముద్రంలోకి పోయే నీటినే తాము వాడుకుంటామని చంద్రబాబు చెప్పారు. వరదను భరించాలి కానీ, వరద నీటిని వాడుకోవద్దా? అని ప్రశ్నించారు. రాయలసీమను సస్యశ్యామలం చేసుకునేందుకు బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తామని చెప్పారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు నుంచి 2026 జులై నాటికి నీరు ఇస్తామని చెప్పారు. రాయలసీమకు సాగునీరు అందించే హెచ్ఎన్ఎస్ఎస్ పై గత వైసీపీ ప్రభుత్వం నాటకాలు ఆడిందని... తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 3,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు. వివిధ రిజర్వాయర్లలో 785 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

# విస్తృత పర్యటన చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్



ఏలూరు జిల్లా ప్రతినిధి- ప్రసాద్ (శుభోదయం న్యూస్) : ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలంలో విస్తృత పర్యటన చేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు. బర్రింకలపాడు/టి. నర్సాపురం: 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శుక్రవారం టి. నర్సాపురం మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉదయం బొర్రంపాలెం ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇరువురు జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. విద్యార్థులకు ఉద్దేశించి దేశభక్తి, క్రమశిక్షణ, కష్టపడి చదవడం యొక్క ప్రాముఖ్యతపై ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు. తరువాత వీరభద్రపురం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే, ఎంపీని గ్రామస్తులు పూలమాలలతో ఘనంగా స్వాగతించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించారు. ఆ తర్వాత వెలగపాడు, తిరుమలదేవి పేట గ్రామాల్లో సిసి రోడ్లను ప్రజల వినియోగానికి అందించారు. తిరుమలదేవి పేటలో స్వచ్ఛమైన తాగునీటి కోసం కొత్త బోరు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజలతో మాట్లాడి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగ్గవరం గ్రామంలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయన ఆత్మబలిదానాన్ని స్మరించారు. అనంతరం జగ్గవరం, గుడ్లపల్లి గ్రామాల్లో కూటమి నాయకుడు బొంతు సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి, వారి సమస్యలను ఆరా తీశారు. టి. నర్సాపురం గ్రామంలో కూటమి నాయకుడు ప్రభాకర్ రావు మరణించడంతో, ఆయన కుటుంబ సభ్యులను కలసి ప్రగాఢ సానుభూతి తెలిపారు, అవసరమైన సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. తరువాత జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్ డిపోలో 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణించిన మహిళలతో మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ "ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడం కోటం ప్రభుత్వ లక్ష్యం. చెప్పిన మాట తప్పక నెరవేర్చడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నాం. అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాల్లా ముందుకు నడవాలని మేము నమ్ముతున్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేస్తాం" అని అన్నారు. ఈ పర్యటనలో కూటమి నేతలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థిని వెన్నెల కు లాప్ టాప్ బహుకరణ.



తనకల్లు , మండల రిపోర్టర్, రవీంద్ర (శుభోదయం న్యూస్) : తనకల్లు మండలంలోని జనసేన నాయకుడు తనకల్లు మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ ఎం యోగి ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థినికి లాప్టాప్ అందజేశారు. తనకల్లు మండలంలోని పాతూరు గుట్ట కింద నివాసం ఉంటున్న పాత్రికేయులు రవిచంద్ర కుమార్తె వెన్నెల చదువులో బాగా రాణిస్తూ పులివెందుల జేఎన్టీయూ కాలేజీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, ఆమెకు చదువు నిమిత్తం లాప్టాప్ అవసరం కాగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్న కారణంగా వారి పరిస్థితి తెలుసుకున్న జనసేన నాయకుడు ఎం యోగి ఆ అమ్మాయి చదివి నిమిత్తం, ఆ అమ్మాయి బాగా చదువుకోవాలని ఆ అమ్మాయికి ఏ లోటు లేకుండా చదువు పరంగా సహాయ సహకారాలు అందిస్తే ఇంకా ఉన్నత చదువులు చదివి ఉన్నతమైన ఉద్యోగాలు సంపాదించి సమాజానికి తన వంతు సేవలు అందిస్తుందని భావించి తన సొంత నిధులతో లాప్టాప్ ఏర్పాటు చేసి తనకు అందజేశారు.తనకుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని లాప్ టాప్ అందజేసిన యోగికి రవిచంద్ర కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## తనకల్లు మార్కెట్ యార్డ్ లో జెండా ఎగరేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ చంద్రకళ



తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్) : 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తనకల్లు మార్కెట్ యార్డు చైర్ పర్సన్ చంద్రకళ జండా ఎగరవేశారు. ఈ సందర్భంగా భూక్య చంద్రకళ మాట్లాడుతూ ఈరోజు ఒక పండగ మన దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతోంది తెల్లదొర్లతో పోరాటం చేసిన మహాత్మా గాంధీ సుభాష్ చంద్రబోస్ ఛత్రపతి శివాజీ ఉయ్యాలవారి నరసింహారెడ్డి ఇలాంటి ఉత్తమ వీరులు పోరాటం చేసి తెల్ల దొరల నుంచి మనం స్వతంత్రంగా బతికే విధంగా 1947లో స్వతంత్రం తెచ్చిన ఘనత వారికి చెందుతుందని అదేవిధంగా మార్కెట్ యార్డులో జాతీయ జెండా ఎగరవేసే అవకాశం మాకిచ్చిన గౌరవ శాసనసభ శ్రీ కందికుంట వెంకటప్రసాద్ అన్న గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం మరి ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సెక్రెటరీ చైర్మన్ భర్త జై కుమార్ నాయక్ శ్రీనాథ్ పలువురు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి పథకాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాతో కలిసి ప్రారంభించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.





నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): నంద్యాల పట్టణంలోని బస్టాండ్ నుండి బనగానపల్లె కు వెళ్ళే బస్ సర్వీస్ లో జిల్లా కలెక్టర్, సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి.. మహిళా సోదరీమణులతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే ఫింఛన్ రూ. 3 నుంచి 4 వేలకు పెంచడం, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు విజయవంతంగా అమలు చేశాం తాజాగా నేడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం సంతోషకరం అని పేర్కొన్నారు.తొలుత ఉచిత బస్సు ప్రయాణం జిల్లా వరకే పరిమితం చేయాలని ఆలోచించినప్పటికీ, మహిళలకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చాలనే ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించాం.ఈ పథకంలో భాగంగా (పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్) 5 రకాల బస్సుల్లో.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ కార్డుతో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చు అని సూచించారు.నేడు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తోంది.ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో.. అదనపు బస్సుల అవసరం ఉంటుందని భావించి, కొత్త బస్సులకు ప్రభుత్వం ఇప్పటికే ఆర్డర్ ఇవ్వడం జరిగింది.ఉచిత బస్సు ప్రయాణం వల్ల చిరు వ్యాపారులకు, ఉద్యోగులకు, దూర ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెసులబాటు కల్పిస్తోంది అని తెలియజేశారు.

## ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల మండలం వెంకటేశ్వరపురం గ్రామ పరిధిలోని ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా , ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ హాజరై విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, మరియు సమాజ సేవ ప్రాముఖ్యతను వివరించారు.పాఠశాల చైర్మన్ శ్రీ కొండా రెడ్డి ఈ సందర్భం పై సందేశం పంపి, విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, మరియు జ్ఞానంతో దేశానికి సేవ చేసే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక నృత్యాలు, అద్భుతమైన మార్చ్‌పాస్ట్, తైక్వాండో ప్రదర్శన, మరియు పిరమిడ్ ప్రదర్శనలతో అందరినీ అలరించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, మరియు తల్లిదండ్రులు ఈ వేడుకలో పాల్గొని, విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

## పామూరు వైయస్సార్‌సీపీ కార్యాలయం ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): 79 వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని పామూరు వైయస్సార్‌సీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.. అనంతరం వారు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు త్యాగఫలము వలన మనకు స్వాతంత్ర్యం వచ్చిందని,వారిని మనము స్ఫూర్తిగా తీసుకోని వారి ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.. ఈ వేడుకల్లో గంగసాని హుస్సేన్ రెడ్డి, గంగసాని లక్ష్మి, చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి,యాదల సాయికిరణ్, షేక్ చాంద్ బాష, షేక్ గయాజ్, షేక్ నాయబ్ రసూల్,ఇర్రి కృష్ణారెడ్డి,బారా షరీఫ్,80 నాయబ్ రసూల్, గయకవాడ సుహాసిని, ఓరుగంటి పద్మ, పందిటి వెంకటలక్ష్మి, గట్ల శివకుమారి, సవరం రత్తమ్మ, పిరికిటి వెంకట నారాయణ, తుపాకుల ఆంజనేయులు రెడ్డి,శ్రీరామ శ్రీనివాసులు, ఏసురత్నం, పోతుల రమేష్, తాతపూడి రాము,మన్నెం మాధవ, షేక్ సలీం, బద్రిస్వామి రంగారెడ్డి, ముడియాల అనంతరెడ్డి, షేక్ రసూల్(షార్ప్ )షేక్ రసూల్ (సిటిజెన్ ), షేక్ రసూల్, షేక్ కాలేషా, షేక్ ఖాసీం పీరా,పోలు మోహన్ రెడ్డి, మిరియం పరమేశ్వరరావు, మిరియం రామారావు,థమ్సప్ మహబూబ్ బాష, ఈనాడు హాజీ, షేక్ షబ్బీర్, పైడాలా వెంకటరెడ్డి, ఏండ్లురి సాల్మాన్, కోటపాటి వెంకటస్వామి రెడ్డి, వాకమళ్ల మహేష్ రెడ్డి,వాకమళ్ల మల్లికార్జున రెడ్డి, జిల్లెల తిరుపతి రెడ్డి, దండు నారాయణ రెడ్డి, బోయల్లా మాధవ, ముప్పారపు అనిల్, షేక్ రసూల్ ఖాన్, షేక్ నాగూర్ బాష, భవానీ వెంకటేశ్వర్లు, బాలగురవయ్య,నాగి రసూల్, నాగి హరీష్, పోలుబోయిన నరసింహారావు,నేతి మాలకొండయ్య, మారాంరెడ్డి మాలకొండరెడ్డి, పోలేపల్లి సిద్దయ్య,చల్లా సుబ్బారావు,సుత్తినేని రమణయ్య, పావులూరి ఆదినారాయణ,చింతంరెడ్డి బాలిరెడ్డి, బోసు, కుమ్మరికుంట ఇశ్రాయేలు, పిన్నిబోయిన శ్రీరాములు, పందిటి గురవయ్య, కసిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, పోలు బాలురెడ్డి, మట్టే అంకబాబు, సరాబ్ కృష్ణ అంకెపల్లి రమణారెడ్డి, పిన్నిబోయిన నరసింహులు, షేక్ వసీమ్,కోట వెంకటరెడ్డి, బూసి వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## పామూరు పట్టణంలోని విరాట్ నగర్ మండల పరిషత్ పాఠశాల స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న పందిటి హరీష్



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు పట్టణంలోని విరాట్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఘనంగా జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన బాలబాలికలకు పందిటి హరీష్ గారు స్వయంగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ %-% "మన దేశం అంటే మన ఇల్లు లాంటిది. మన ఇల్లును మనం శుభ్రంగా, అందంగా ఉంచినట్టు, దేశాన్ని కూడా అందరం కలసి కాపాడాలి. మనం బాగా చదివి, నిజాయితీగా ఉండి, ఒకరికి ఒకరు సహాయం చేస్తే మన దేశం ఇంకా బలంగా, అందంగా మారుతుంది. మన జెండాలో ఉన్న మూడు రంగులు మనకు మంచి పనులు చేయమని, ధైర్యంగా ఉండమని, శాంతి పాటించమని గుర్తు చేస్తాయి" అలాగే %-% "మీరు అందరూ బాగా చదివి, మంచి డాక్టర్లు, టీచర్లు, పోలీస్, సైనికులు, నాయకులు అవ్వాలి. అప్పుడు మన పామూరు మాత్రమే కాదు, మొత్తం భారతదేశం గర్వపడుతుంది" అని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి హరిబాబు, నొస్సం నాగేంద్రాచార్యులు, మెంట నరసింహారావు, నర్సింగ్ సాంబయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలి..

### అక్షర జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో... కదిరి పార్థసారథి




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఉన్నత విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అన్నారు.పామూరు పట్టణంలో అక్షర జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం పువ్వాడి రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కదిరి పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా కదిరి పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లితండ్రులకు కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫ్రెషర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.2024 విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయి లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కళాశాల యాజమాన్యం కదిరి బాబు రంగారావు కదిరి పార్థసారథి కి ఘనంగా శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఇరగని చలపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేడు శ్రీకృష్ణ జన్మ దిన వేడుకలు బండ్ల నారాయణ




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా నేడు పామూరు పట్టణంలోని మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు మరియు తీర్థప్రసాదాలు పంచడం జరుగుతుందని తదుపరి సాయంత్రం నాలుగు గంటలకు ఉంటే కొట్టు కార్యక్రమం శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి గిరి రాజు నరసింహ బాబు మరియు వేద పండితులు సత్య బాబు స్వామివారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడుతుందని బండ్ల నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అంచురు వెంకటరెడ్డి.



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డులో యారవ రమా శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గోపాలపురం టిడిపి నాయకులు అంచురి వెంకటరెడ్డి యారవ రమా శ్రీనివాసులకు శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓగూరు నరసింహారావు, షేక్ చిన్న హజరత్, నేలపాటి మాల్యాద్రి, మాలపాటి వెంకటేశ్వర్లు రెడ్డి, ఓగూరు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యారవ రమ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం పాల్గొన్న పిడుగు శ్రీనివాసులు మరియు టీడీపీ బీజేపీ జనసేన నాయకులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమ శ్రీనివాసులు నియమితులైన సందర్భంగా కనిగిరి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు ప్రమాణ స్వీకారం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పామూరు పట్టణ వార్డ్ నెంబర్ పిడుగు శ్రీనివాసులు పాల్గొని యారవ రమ శ్రీనివాసులకు మరియు వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు కు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ దర్శి రాము, పట్టణ మాజీ అధ్యక్షులు కాజా రహమతుల్లా, బిజెపి నాయకులు కొండిశెట్టి రమణయ్య, సొసైటీ చైర్మన్ పాలపర్తి రమణయ్య, ఆర్ఆర్ రఫీ, పత్తు మస్తాన్, వాయినేని రాఘవ, కావేరి రసూల్, గుత్తి మహేష్, మొబీన మౌలాలి, వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద దోర్నాల మండలంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు




దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండల పరిధిలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలన్నింటిలో జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో, పోలీస్ స్టేషన్లో, ప్రభుత్వవైద్యశాలలో అటవీ శాఖ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజర్ హరి,వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి జవహర్లాల్ నాయక్ జెండా ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపనతో జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ లో భాగంగా స్త్రీ శక్తి ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సూపర్ సిక్స్ లో భాగంగా స్త్రీ శక్తి కార్యక్రమాన్ని పువ్వాడి వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రారంభించారు. స్వీట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించి పామూరు బస్టాండ్ నుండి మమ్మీ డాడీ సెంటర్ వరకు ప్రయాణం చేసి రోడ్డుకు ఇరువైపులా నుంచొని సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ మహిళలకు వివరిస్తూ ప్రతి సెంటర్లో థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేస్తూ కూటమి నాయకులు కార్యకర్తలు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఏఎంసీ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సింగల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, సొసైటీ చైర్మన్ పాలపర్తి రమణయ్య, పట్టణ అధ్యక్షులు అమీర్జాన్, ఎంపీటీసీ బోల్ల నరసింహారావు, పట్టణ ఉపాధ్యక్షులు కోటిరెడ్డి, టిడిపి నాయకులు పువ్వాడి రామారావు, హాస్పిటల్ చైర్మన్ సాంబయ్య, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు, బూతు ఇంచార్జ్ బండ్ల నారాయణ, అంచురి వెంకటరెడ్డి, మాలపాటి వెంకటేశ్వర్ రెడ్డి, కొండ నర్సింహులు, చిన్న హజరత్, తదితరులు పాల్గొన్నారు.

## యారవ రమ శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలియజేసిన బోల్ల నరసింహారావు...



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) కనిగిరి పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డులో యారవ రమా శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ యువ నాయకులు బోల్ల నరసింహారావు యారవ రమా శ్రీనివాసులకు గజమాల మరియు శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ఇర్రికోటిరెడ్డి, సింగల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, మండ్ల రమణయ్య, మండ్ల మల్లికార్జున, ఇర్రి శ్రీనివాసులు, మాలపాటి వెంకటేశ్వర్లు రెడ్డి, నేలపాటి మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## యారవ రమ శ్రీనివాసుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న షేక్ హాజీ గౌస్...



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) :: కనిగిరి పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డులో యారవ రమా శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ హాజీ గౌస్ యారవ రమా శ్రీనివాసులకు శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు కాజా రహమతుల్లా, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల లో 79వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాలలో 79వ స్వాతంత్రం దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ముందుగా కళాశాల శాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఇరగని చలపతి రావు, స్కూల్ ఛైర్మెన్ మూరం మస్తాన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల సెక్రటరీ%ఁ% కరస్పాండెంట్ కదిరి పార్థసారథి,మాజీ ఎంపిటిసి లు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి, మాజీ సర్పంచ్ సయ్యద్ దౌలత్ భాష, నీటి సంఘం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బాల కేశవ రెడ్డి,షేక్ అహమ్మద్,ఆర్ కె వలి,గోపి,సత్తార్, టి లక్ష్మీ నారాయణ,ఉప సర్పంచ్ టి బాబురావు,కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్,కళాశాల ఇంజనీర్ నిమ్మల శ్రీనివాసరావు,షేక్ నాయబ్ రసూల్, కెవి నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల ఛైర్మెన్ ఇరగని చలపతి రావు, స్కూల్ ఛైర్మెన్ మూరం మస్తాన్ రెడ్డి,కాలువ నరసయ్య, సుధాకర్ రెడ్డి,నున్నా నారాయణ,మునగల సుధాకర్ రెడ్డి, ఇరగని మాధవ రావు, దుగ్గిరెడ్డి వెంగల్ రెడ్డి,పాశం సురేష్,వెంకటయ్య,వెంకటాద్రి, సైదయ్య,మామిడాల శీనయ్య ,ఆలా చిన్న వెంకటయ్య, ప్రధాన ఉపాధ్యాయులు బో డే ప్రసాద్ , ఉపాధ్యాయులు విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.

## 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ సింగల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : సిఎస్పురం పట్టణంలోని శ్రీ పరాశక్తి తల్లి ట్యూషన్ పాయింట్ మరియు కోచింగ్ సెంటర్ నందు 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ సింగల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి ఆయన మాట్లాడుతూ 1947లో ఇదే రోజున మన దేశం బ్రిటిష్ వలస పాలన నుండి విముక్తి పొందిందని అన్నారు ఈరోజు మనకు స్వేచ్ఛను తెచ్చిపెట్టిన స్వతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ వారి త్యాగాలను గౌరవించే దినమని స్వతంత్ర దినోత్సవం కేవలం ఒక వేడుక కాదని అది మనకు బాధ్యత గుర్తు చేస్తుందని ఆయన దేశ అభివృద్ధికి మనం ప్రతినిత్యం కృషి చేయాలని సమాజంలో సమానత్వం ఐక్యతను నిలబెట్టాలని తెలియజేశారు అనంతరం స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకోవాలని అన్నారు తదుపరి కాంపిటేటివ్ మెటీరియల్స్ పంపిణి చేసి ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల నరేష్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండిపెండెన్స్ డే ఘనంగా జరిపిన ప్రభుత్వశాఖలు



ములుగు జిల్లా, మూర్తి రిపోర్టర్ (శుభోదయం న్యూస్) :ములుగు జిల్లాలో అన్నీ కార్యాలయాల యందు 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ప్రభుత్వవిద్యాలయాలలో, ప్రవేట్ విద్యాలయాల్లో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్నారు. మన దేశంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజలు పండుగగా జరుపుకున్నారు. భారతదేశమును బ్రిటిష్ పాలన నుండి విముక్తి అయిన రోజు, భారత స్వాతంత్ర్య పోరాటాన్ని అలుపెరగకుండా పోరాటం చేసి ఎందరో త్యాగదనుల ప్రతీక. కోట్లాదిమంది భారతీయులలో స్ఫూర్తినిస్తూ మన దేశ అవనిత్యాన్ని సాటి చెప్పి దేశ పురోగతికి దోహద పడినది. రెండువేల సంవత్సరాలు బ్రిటిష్ వలస పాలన నుండి భారతదేశం విభక్తి ఆగస్టు 15. 1947న ఏర్పడినది. ములుగు జిల్లా ప్రభుత్వ తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, వైద్య కార్యాలయాలు, మండల విద్యా వనరుల శిక్షణా కేంద్రాలు, అటవీ శాఖ కార్యాలయాలు, ప్రైవేటు కార్యాలయాలు జాతీయ మూవెళ్ల జెండా ఎగురవేసి ఇండిపెండెన్స్ డే జరుపుకున్నారు.

## గజ్వేల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవం వేడుకలు

### వేడుకల్లో పాల్గొన్న టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఆగస్టు 15: గజ్వేల్ లో జరిగిన79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు టీపీసీసీ అధికార ప్రతినిధి బండారి శ్రీకాంత్ రావు హాజరయ్యారు. గజ్వేల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు సందర్భంగా మాట్లాడుతూ 79 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ కోట్లాదిమంది అమరుల త్యాగాలతో స్వాతంత్రం సాధించుకునామాని 1947 ఆగస్టు 15 భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఢిల్లీలోని ఎర్రకోట లాహోరీ గేటు పై మువ్వన్నెల జెండాను ఎగరవేశారని భారతదేశం మొత్తం ఆగస్టు 15న త్రివర్ణ పథకాన్ని ఎగరవేసి పండగ చేసుకుంటారని తెలిపారు. భారత స్వాతంత్ర పోరాటం ఒక అలుపెరుగని పోరాటమని ఎందరో త్యాగాలకు ప్రతీక అని అహింసా సిద్ధాంతాన్ని ఏకతాటిపై నడిపించిన ఏకైక వ్యక్తి మహాత్మగాంధీ అని ఆయన చూపిన స్ఫూర్తితో మనం ముందుకు సాగాలన్నారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, నాచారం ట్రస్ట్ బోర్డు మెంబర్లు కూచారంసంతోష్ కుమార్, నాయకం శ్రీనివాస్, వర్గల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూముకుంట విష్ణువర్ధన్ రెడ్డి భూమిరెడ్డిహనుమంత రెడ్డి ఆత్మ కమిటీ డైరెక్టర్లు రాజలింగం గౌడ్, బుచ్చిరెడ్డి, మామిడి కృష్ణ , జానీ గౌడ్, మెదక్ పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తాళ్ల నవీన్ గౌడ్, జయాల వేణుగోపాల్, డాక్టర్ నాయిని శ్రీనివాస్, గౌరవ స్వామి, అరికెల స్వామి, మంగలి మల్లేశం, మంగలి స్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎస్ ఆర్ కె డైరీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నుల పంపిణీ

### వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ శివరామకృష్ణ



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఆగస్టు 15: 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వర్గల్ మండలం కేంద్రంలో గల ఎస్ ఆర్ కే డైరీలో ఘనంగా నిర్వహించారు. ఎస్ ఆర్ కేడైరీలో త్రివర్ణ పతాకం చైర్మన్ శివరామకృష్ణ ఎగరవేశారు అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు. కంపెనీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు ఇచ్చారు. చైర్మన్ మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర సమరయోధుల పోరాటపాటి పట్టిమ వల్లే ఈరోజు స్వాతంత్రం సిద్ధించిందని తెలిపారు. ఎస్ ఆర్ కే డైరీ ని అభివృద్ధి పథంలో నడిపించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సతీష్ రెడ్డి మార్కెటింగ్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు

## స్వతంత్ర దినోత్సవం సందర్భంగా వాళ్ల సేవలను గుర్తించి సన్మానించిన మాస్ రాజు..




రేగొండ మండల రిపోర్టర్ మంతెన సురేష్, (శుభోదయం న్యూస్) గోరి కొత్తపల్లి మండలం జగ్గయ్యపేట గ్రామంలో సమాచార హక్కు చట్టం గోరుకొత్తపల్లి మండలం కన్వీనర్ మాస్ రాజు గారి ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జగ్గయ్యపేట పాశుద్ధ కార్మికులను మరియు ఫీల్డ్ అసిస్టెంట్ మరియు విద్యుత్ అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శి గారిని మాజీ సర్పంచ్ మరియు ఎంపీటీసీ గార్లను సన్మానించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో మటిక సంతోష్, పొనుగోటి వీరబ్రహ్మం, మూడుపు అశోక్ రెడ్డి, బోయిన్ తిరుపతి, జిగరి అశోక్, మాసు మహిపాల్, ఇప్పకాయల తిరుపతి, కర్రె రాకేష్, లెంకలపల్లి రవి, వడ్ల రాజు, మరి యూత్ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది

## 25 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ నా కుటుంబం అంటూ అందరికీ చేదోడు వాదోడుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య...



రేగొండ మండల రిపోర్టర్ మంతెన సురేష్, (శుభోదయం న్యూస్) రేగొండ మండల కేంద్రంలో శుక్రవారం స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని నేటికీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా 25 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో సేవ చేసుకుంటూ అంచలంచలుగా ఎదుగుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా మరియు మండల జనరల్ సెక్రెటరీగా అదే విధంగా 2018 నుండి నేటి వరకు రేగొండ గోరి కొత్తపల్లి మండలాల మండల అధ్యక్షునిగా పనిచేసుకుంటూ రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మేధావులు మండల జిల్లా నాయకులు అలాగే రాహుల్ గాంధీ సోనియా గాంధీ మల్లికార్జున కార్గే పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మన ప్రియతమ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ ఇనుముల రేవంత్ రెడ్డి గారు అలాగే మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు గారు అలాగే మన గౌరవ భూపాలపల్లి అభివృద్ధి ప్రదాత భూపాలపల్లి శాసనసభ్యులు మన ప్రియతమ నాయకులు గౌరవ శ్రీ గండ్ర సత్యనారాయణ రావు గారు అలాగే నాకు వెన్నంటి ఉండి మొట్టమొదటగా నాకు మండల అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన మా ప్రియతమ నాయకులు గౌరవనీయులు శ్రీ ఐత ప్రకాష్ అన్న గారికి పై వారి యొక్క ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ లో నేటి వరకు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది నన్ను వెన్నంటి నడిపించి నాకు చేదోడు వాదోడుగా ఉన్నటువంటి గోరి కొత్తపల్లి రేగొండ మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు మండల నాయకులకు అన్ని విభాగాల మండల అధ్యక్షులకు ఎంపిటిసి పరిధి ఇన్చార్జిలకు వివిధ హోదాలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు మార్కెట్ కమిటీ చైర్మన్ పిఏసిఎస్ చైర్మన్ ఆలయ కమిటీ చైర్మన్ డైరెక్టర్లకు సర్పంచ్ ఎంపిటిసి జడ్పిటిసి ఎంపీపీ వార్డు సభ్యులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులకు బూత్ కమిటీ కన్వీనర్లకు పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు అలాగే ఇందిరా గాంధీ బొమ్మ దగ్గర మండల నాయకులు కార్యకర్తలు జిల్లా నాయకులు కేక్ కట్ చేపీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో %జూఖఎం% చైర్మన్ నడిపెల్లి విజన్ రావు, జిల్లా నాయకులు మోడం ఉమేష్ గౌడ్, కేసిరెడ్డి ప్రతాపరెడ్డి, మైస భిక్షపతి, మేకల భిక్షపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి,, పటం శంకర్, పున్నం రవి, తదిరులు పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి బోనాలు



రేగొండ మండల రిపోర్టర్ మంతెన సురేష్, (శుభోదయం న్యూస్) రేగొండ మండలం కేంద్రంలో శ్రావణమాసం సందర్భంగా పోచమ్మ తల్లి బోనాలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు రేగొండ గ్రామంలో శ్రావణమాసంలో విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. శ్రావణ మాసంలో మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఒక్క పొద్దులు ఉంటూ పోచమ్మ తల్లి బోనాలను నిర్వహిస్తూ ఉంటారు. గ్రామంలోని గొడ్డు గోదా బాగుండి, పాడి పంట మంచిగా పాండాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని పోచమ్మ తల్లి బోనాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గుడి పూజారి గుంటోజు రాజయ్య, విశ్వబ్రాహ్మణుల కుల సంఘం సభ్యులు కిషన్ చారి,బుగిలయ్య చారి , రవీంద్ర చారి,రాకేష్ చారి, గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉమ్మడి రేగొండ మండలంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు



రేగొండ మండల మంతెన సురేష్ ,(శుభోదయం న్యూస్) ఉమ్మడి రేగొండ మండల కేంద్రంలో79వ, స్వతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో అధికారులు, ఉపాధ్యాయులు వివిధ శాఖ ల అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో కే శ్వేతా గోరి కొత్తపల్లి ఎమ్మార్వో, లక్ష్మీ రాజయ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోలు ఎం వెంకటేశ్వరరావు,గడ్డం రాంప్రసాదరావు, రేగొండ పోలీస్ స్టేషన్లో ఎస్సైలు సందీప్ కుమార్ గోరి కొత్తపల్లి మండలం ఎస్సై సాకారపు దివ్య, పిఏసిఎస్ కార్యాలయంలో చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, సీఈవో జగన్, ఏవోలు పెద్ద వాసుదేవ రెడ్డి, సారయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ హిమబిందు,వెటర్ని డాక్టర్ మైథిలి, ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, ఒంటేరు చంద్రశేఖర్ జెండాలను ఆవిష్కరించారు.ఈ జెండా పండుగ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రజాక్ రేగొండ రెవిన్యూ ఇన్స్పెక్టర్ భరత్ రెడ్డి గోరి కొత్తపల్లి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ నేత వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ పకడే రాజయ్య, మధు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి, ఆధ్వర్యంలో జెండా పండుగ నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ఇప్పకాయల నరసయ్య, జిల్లా నాయకులు మోడం ఉమేష్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, మేకల తిరుపతి, పున్నం రవి, పట్టిమ్ శంకర్, మైస బిక్షపతి, మరియు టిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు కోలేపాక బిక్షపతి, బిజెపి నాయకులు తదిరులు పాల్గొన్నారు

## 79.వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నా బెల్లంపల్లి పట్టణ బీజేపీ నాయకులు



మంచిర్యాల జిల్లా:ఆగస్టు 15 (శుభోదయం న్యూస్) బెల్లంపల్లి పట్టణం 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి పాత బస్టాండ్ ఏరియాలో, రైల్వే స్టేషన్ వద్ద జాతీయ పతాకావిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దార కళ్యాణి మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణ త్యాగాలకు ప్రతిఫలం ఈ స్వతంత్రం దినోత్సవం మన దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులందరిని స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందంటూ ఈరోజు దేశం సుభిక్షంగా ఉంది అంటే నరేంద్ర మోడీ పరిపాలన వల్లనే మొన్నటికి మొన్న జరిగిన పహల్గాం లాంటి దాడుల్లో నరేంద్ర మోడీ పరిపాలన వల్లనే మన హిందువులని చంపినటువంటి వారికి సరైన సమాధానం అందించగలిగామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కునిరాజుల అరవింద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పుల మోహన్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, సీనియర్ నాయకుడు దూది ప్రకాష్, జిదుల రాములు, వేల్పుల రాజయ్య, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గోమాస కమల, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎరుకల నర్సింగ్,ఎర్రోజు శ్రీనివాస్, కోదాటి కళావతి షేక్ గౌస్ బాబా, చింతకింది లావణ్య, పుల్లూరి రాము, పుల్లె ప్రశాంత్, పోతురాజుల శంకర్, రాజేశ్వరి, సోమ టెంక వెంకటేష్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వరద ప్రవాహ ఉధృతి వలన పరిసర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్



పాపన్నపేట ఆగస్టు 15 శుభోదయం న్యూస్ (మల్లారెడ్డికృష్ణ) : సింగూర్ ప్రాజెక్ట్ వరద ప్రవాహ ఉధృతి ఏడుపాయల అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు శుక్రవారం పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగూర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేయడం వల్ల వరద ప్రవాహ ఉధృతితో ఏడుపాయల అమ్మవారి ఆలయం వద్దకు నీరు అధిక మొత్తంలో చేరిందని ఆలయం మూసివేయడం జరిగిందని పరిసర ప్రాంతాలను పరిశీలించి ప్రవాహ ఉధృతి బాగా ఉందని ప్రజల ఎవరిని అటువైపు వెళ్ళనీయకూడదని భద్రతపై దృష్టి సారించాలని పోలీస్ యంత్రాంగానికి సూచించడం జరిగింది అన్నారు.. వాతావరణ ప్రతికూల పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని ప్రస్తుత వాతావరణం నిర్మానుష్యంగా ఉందని ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రిపోర్టర్ - జి నరహరి (శుభోదయం న్యూస్): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం (శాంతినగర్) ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యువజన సేవా సంఘం వారు పతాకం ఎగురవేసి జాతీయ పతాకానికి వందనం సమర్పించారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



కోదాడ, ఆగస్టు 15 శుభోదయం న్యూస్: అనంతగిరి మండల కేంద్రంలో డాక్టర్ అంజి యాదవ్ బిజెపి పార్టీ ఆఫీసు ఆవరణలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఆ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి మోర్చా అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు చింతకుంట్ల సతీష్, మండల నాయకులు మల్లెబోయిన వెంకటేష్ బాబు గోళ్ళ సైదులు, చిర్ర వెంకయ్య, వాడ కొప్పుల నవీన్, సాయి, వినోద్, వీరయ్య ,గోపి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



అనంతగిరి, ఆగస్టు 15 శుభోదయం న్యూస్: 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అనంతగిరి మండల పరిధిలోని వాయిల సింగవరం గ్రామంలో ఆటో యూనియన్ వారి ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు రాజా సైదులు తిరపయ్య వెంకన్న వెంకటి వివిధ పాఠశాల ఉపాధ్యాయులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



అనంతగిరి, ఆగస్టు 15 శుభోదయం న్యూస్: 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం అనంతగిరి మండల పరిధిలోని వాయిల సింగవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి జాతీయ పతాకాన్ని గ్రామ కార్యదర్శి సౌమ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో రామారావు మేళ్లచెరువు గురవయ్య ఫీల్డ్ అసిస్టెంట్ శీను వెంకన్న మురళి శివ ప్రవీణ్ రేషన్ డీలర్ బొడ్డుపల్లి శీను వెంకటేశ్వర్లు గద్దె మురళి ఆశ వర్కర్లు గ్రామపంచాయతీ సిబ్బంది వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

## రామాయంపేటలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 15:- మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నాడు గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కమిషనర్ ఎం దేవేందర్,స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై బాలరాజ్, పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద సిఐ వెంకట రాజాగౌడ్,పిఏసిఎస్ కార్యాలయం వద్ద బాదే చంద్రం,వ్యవసాయ కార్యాలయం వద్ద రాజ్ నారాయణ,మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ ఎం దేవేందర్ ఎంఈఓ కార్యాలయం వద్ద శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయం వద్ద శాజీలోద్దీన్,తహసిల్దార్ కార్యాలయం వద్ద రజనీకుమారి,అదేవిధంగా పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు పట్టణంలోని పలు రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద నాయకులు జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం ఎందరో మహానుభావుల ప్రాణాల త్యాగఫలమేనన్నారు.ఆనాడు బ్రిటీష్ వాళ్లతో



అలుపెరుగని పోరాటం చేసి ఈ స్వాతంత్ర్యన్ని సాధించుకున్నామన్నారు.ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 1947 ఆగస్టు 15న భారతదేశం 200 సంవత్సరాల బ్రిటీష్ వారి పాలన నుంచి విముక్తి పొందామన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల అపారమైన ధైర్యసాహసాలు,త్యాగాలే బ్రిటీష్ వారిని గద్దె దించి దేశాన్ని విముక్తం చేశాయన్నారు.నేటి యువత స్వాతంత్ర్య సమరయోధులు మహానుభావుల అడుగుజాడల్లో శాంతి మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.

## దీక్ష గురువు ప్రేమ్ సింగ్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం

### హాజరైన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 15:- మెదక్ జిల్లా రామాయంపేట మండలం జమ్లా తండాలో శుక్రవారం నాడు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నూతనంగా ఏర్పాటు చేసిన దీక్ష గురువు ప్రేమ్ సింగ్ మహారాజ్ విగ్రహం ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ప్రేమ్ సింగ్ మహారాజ్ విగ్రహం వద్ద అయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజల అభివృద్ధి,సంక్షేమం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే అన్ని గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని మరో మూడు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశామని,రైతు భరోసా డబ్బులు చెల్లిస్తున్నామన్నారు.నిరుపేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తూ వారి ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు.రాబోవు రోజుల్లో తన సొంత ఖర్చులతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో అభివృద్ధి సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి సుప్రభాత రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి,పూజారి హన్మ్య మహారాజ్, సఖావత్ కులియా మహారాజ్,బానోత్ అనిల్,మాలోత్ రాంచందర్ నాయక్,బిక్యా నాయక్,బండారి మహేందర్ రెడ్డి,పాండు నాయక్, బన్సీనాయక్,అశోక్ నాయక్.మాజీ ఉప సర్పంచ్ శివ ప్రసాద్ రావు,హనుమంతరావు.తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపొందిన యువకులకు బహుమతులు అందజేత



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 15:- మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెరువు గ్రామంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్,వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన యువకులకు స్పాన్సర్లు శుక్రవారం నాడు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా క్రీడలు నిర్వహించిన దాతలు మాట్లాడుతూ యువకుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని ఉద్దేశంతో ఈ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు.విద్యార్థులు యువకులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత శిఖరాలలో అధిరోహించాలని ఆకాంక్షించారు.తాము నిర్వహించిన పోటీల్లో యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామ స్థాయిలోనే కాకుండా మండల,జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో యువకులు రాణించాలని అందుకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు.అనంతరం గెలుపొందిన యువకులకు బహుమతులతో పాటు నగదు అందజేశారు.ఈ కార్యక్రమంలో దాతలు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రిపోర్టర్ జి నరహరి (శుభోదయం న్యూస్) : మదర్ మేరీ మోడల్ స్కూల్ శుక్రవారం 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జాతీయ పతాకనావిష్కరించి వందనం సమర్పించారు అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేణుకా మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ యోగ మూర్తి, కోశాధికారి వెంకటేశ్వరులు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ జవహర్ నగర్ పార్టీ కార్యాలయంలో 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రిపోర్టర్ జి నరహరి (శుభోదయం న్యూస్) : జవహర్ నగర్ బిజెపి పశ్చిమ శాఖ అధ్యక్షులు కమల్ గారి ఆధ్వర్యంలో 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా బిజెపి పార్టీ ఆఫీసులో జాతీయ జెండా ఎగర వేయడం జరిగింది. అలాగే తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపు మేరకు హర్ గర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికులు భారత దేశానికి చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారిని గౌరవంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ లోని బిజెపి మరియు వివిధ మోర్చాలలో వివిధ స్థాయిలలో బాధ్యతలు కలిగిన రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, మండల శాఖ నాయకులు కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగి అవార్డు గ్రహీత కనపర్తి ఏ ఎల్ ఎంలి



శుభోదయం న్యూస్ సంగెం :ఆగస్టు 15( ఐత. కుమార్ ) : వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ఏ ఎల్ ఎం దేవేందర్ మండలంలోని కాపుల కనపర్తి గ్రామంలోని విద్యుత్ శాఖలో ఏ ఎల్ ఎం గా విధులు నిర్వహిస్తున్న ధారావత్ దేవేందర్ నాయక్ 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నీజాయి తిపరుడిగా ఏ ఈ/ఆప్/ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్నారు. ఈ శుభ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ నాతోటి ఉద్యోగులందరికీ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు దీంతో ఉద్యోగ వృత్తి పట్ల నామీద మరింత బాధ్యత పెరిగింది, మరిన్ని మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు. మీ అందరికీ నా యొక్క హృదయపూర్వక ధన్యవాదాలు, నేను తెలంగాణ ఉద్యమకారుడిగా ఈ అవార్డుని తెలంగాణ అమరవీరులకు అంకితం చేస్తున్నాను అని అన్నారు.

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ని కలిసిన బిఆర్ఎస్ యువ నాయకులు వేగండ్ల శ్రీనివాస్



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ శ్రీమతి కల్వకుంట్ల కవిత ని బిఆర్ఎస్ యువనాయకులు వేగండ్ల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది, ఆయనతోపాటు జాగృతి విద్యార్థి రాష్ట్ర నాయకులు తోట హరీష్ గౌడ్ కూడా కల్వకుంట్ల కవిత ని కలిశారు. తెలంగాణ జాగృతి సంస్థను బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా జాగృతి సంస్థ బాధ్యులను నియమిస్తున్న సందర్భంగా టిఆర్ఎస్ యువనాయకులైన వేగండ్ల శ్రీనివాస్ కి రామగుండం నియోజక వర్గంలో కీలక బాధ్యతలను తీసుకాబోతున్నారు అని తెలియజేస్తూ జాగృతి సంస్థను రామగుండం నియోజకవర్గం లో గ్రామ గ్రామాన విస్తరించే దిశగా కృషి చేస్తానని ఈ సందర్భంగా వేగండ్ల శ్రీనివాస్ గారు తెలియజేయడం జరిగింది.

## ఘనంగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ జన్మదిన వేడుకలు

### సుమారు 1000 మందికి అన్నదాన కార్యక్రమం

### కాంగ్రెస్ పార్టీ నగరపాలక అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో





రామగుండం మండలం, రిపోర్టర్ -(శుభోదయం న్యూస్): స్థానిక ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నగర పాలక అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ జన్మదిన సందర్భంగా స్థానిక నగరపాలక అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో ఖని ప్రధాన చౌరస్తాలో సుమారు 1000 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హాజరై జన్మదిన కేకును వారి చేతుల మీదుగా కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు బొంతల రాజేష్ మాట్లాడుతూ మా నాయకుడు రాజ్ ఠాకూర్ పుట్టినరోజు వేడుకలు భాగంగా సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని వ్యక్తం చేశారు అలాగే రామగుండం చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ప్రస్తుత ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ కూడా మద్దతు ఇవ్వాలని కోరారు రానున్నటువంటి రోజుల్లో ఇంకా మరిన్ని సేవా కార్యక్రమాలతో రాష్ట్ర నాయకత్వాన్ని బలపరుస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు ఎన్ ఎస్ యు ఐ నాయకులు యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ అధిక సంఖ్యలో ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నందు 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన జెండా వందనం కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు శ్రీ యరపతినేని శ్రీనివాసరావు గారు పాల్గొని జెండా వందనం చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా శాంతి కపోతాలను ఎగురవేయడం జరిగింది. అనంతరం విద్యార్థిని విద్యార్థులు చేసిన %చీజజ% మార్చ్ ఫాస్ట్ కు యరపతినేని గారు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు పిరమిడ్ ప్రదర్శనలతో అలరించారు. వేడుకలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేయడం జరిగింది.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వెదుళ్ళపల్లి లో ఘనంగా 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవాలు



(శుభోదయం న్యూస్) బాపట్ల జిల్లా:8 దశాబ్దాల భారత స్వాతంత్రం సాధించిన విజయాలతో పాటు భవిష్యత్తులో-పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయి,జన విజ్ఞాన వేదిక వెదుళ్ళపల్లి పరిసర గ్రామాల సమాఖ్య ఆధ్వర్యంలో 79వ భారత స్వాతంత్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి,ఈ కార్యక్రమానికి ప్రాంతీయ కార్యదర్శి దేవల్ల వెంకయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ 100 ఏళ్ల భారత స్వాతంత్రోద్యమంలో 1857 సిపాయిల తిరుగుబాటు నుండి 1947 స్వాతంత్ర సాధన కొరకు వేలాది మంది మహనీయులు మహోన్నత త్యాగాలు చేశారు వారి స్ఫూర్తితో నేటి దేశ సమస్యలను పరిష్కరించుటకు నేటితరం ముందుకు రావాలని కోరారు,కోట వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న 17వ తేదీన బాపట్లలో జన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా మహాసభల్లో. 8 దశాబ్దాల భారత స్వాతంత్ర ప్రస్థానాన్ని. సాధించిన విజయాలతో పాటు పరిష్కరించాల్సిన సమస్యలను శాస్త్రీయంగా చర్చించుదాం మహాసభలను జయప్రదం చేయండి అన్నారు ఈ కార్యక్రమంలో వెదుళ్ళపల్లి బేతపూడి కొత్తపాలెం కావూరి వారి పాలెం పడమర బాపట్ల తదితర గ్రామాల నుండి పెద్దలు ప్రజలు పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో దేవర్ల వెంకయ్య కావూరి రమణారెడ్డి డివి రమణయ్య బండారు వెంకటేశ్వర్లు. నాయుడు శ్రీనివాస్ రెడ్డి బాలరంగం శెట్టి అక్కల వెంకటేశ్వర్లు భోగి రెడ్డి శ్రీరాములు రెడ్డి.. కోట నాగేశ్వరరావు. టైలర్ శ్రీనివాస్, కుంచాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు,

## కూటమి ప్రభుత్వం నిర్బంధ పాలనలో 79 వ స్వాతంత్ర్యం దినం జరుపుకుంటున్న రాష్ట్ర ప్రజలు.

### గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : "మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అనేక మంది మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారు. వారి త్యాగాల వల్లనే ఈ రోజు మనం స్వేచ్ఛాయుతమైన దేశంలో జీవిస్తున్నాము. స్వాతంత్ర్యం కేవలం మన హక్కుల గుర్తు మాత్రమే కాదు అది మన బాధ్యతల గుర్తు కూడా కానీ మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాత్రం దానికి బిన్నంగా హక్కులు ప్రశ్నిస్తున్నా వారందరినీ నిర్బంధానికి గురి చేసి జైలులో పెడుతున్నారని గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి ఈ రోజు గన్నవరం %ూ=జూ% నియోజకవర్గం కార్యాలయం లో 79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగుర వేసిన సందర్భంగా తన ఆ వేదనను అక్కడ పాల్గొన్నా వారి నుద్దేశించి అన్నారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అడిగిన వారిని అక్రమ కేసులు బనాయించి మరో ఎమర్జెన్సీ లాగా జైలుకు పంపుతున్నారని ఇచ్చిన హామీలు ఒక్కటి సరిగా అమలు చేయలేదు. కనీసం రాష్ట్రం లో మహిళలకు బాలికలపై రక్షణ లేకుండా ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో అత్యాచారాలు, మానభంగాలు,దాడులు, జరుగుతున్నాయి వాటిని అరికట్టే పరిస్థితి ఈ ప్రభుత్వం నికి పట్టటం లేదు అన్నారు. పేద ప్రజలకు రైతులకు,విద్యార్థులకు, అండగా అన్నివిధాల గత 15 సంవత్సరాలు నుండి తన స్వంత నిధులతో గన్నవరం నియోజకవర్గంలో సహాయపడిన మాజీ శాసన సభ్యులు వల్లభనేని వంశీ మోహన్ పై అక్రమ కేసులు పెట్టి 140 రోజులు జైలులో పెట్టారూ ఆయన ఆరోగ్యం క్షీణించిన కూడా కక్ష సాధింపులతో వంశీ నేటికి వేధిస్తున్నారని ఆమే ఆవేదనను వ్యక్తం చేశారు.ఇటువంటి నిర్బంధకాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్నా నిర్బంధ కాండలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలలోకి వచ్చి తగిన గుణపాఠం చెప్పాలని ఆమె ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ యం పి పి సాతులూరి శివ నాగ రాజా కుమారి, %ూ=జూ% జిల్లా ప్రధాన కార్యదర్శి చిన మస్తాన్ జిల్లా నాయకులు నిడమర్తి రామారావు, పేతురు వార్డు సభ్యులు లుక్కా ప్రసాద్ ,సుర%శీ% విజయ లక్ష్మీ, రత్నమాల, మరియమ్మ, చీమట శ్రీను ,కిరణ్, రాజేష్,రజినీ, ఈద పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్కడ మానవ ఆవాసాలు ఏర్పడితే అనుక్షణం విద్యుత్ అత్యావసరం అందుకే నిరంతర విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటు మరో ఐదేళ్లలో నిర్మించాలని యోచన

# జాబిలిపై అణువిద్యుత్ సాధ్యమా?



వ్యోమగాములు తమ అంతరిక్ష పరిశో ధనలకు మజిలీగా చందమామను మార్చుకోవాలని భావిస్తున్న తరుణంలో చంద్రునిపై ఏకంగా అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పాలని నాసా భావిస్తోంది. అయితే 2030కల్లా అక్కడ న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యమా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎక్కువకాలంపాటు వ్యోమగాములు చంద్రునిపైనే స్థిరనివాసం ఏర్పర్చుకుని జీవించాలన్నా, ఎలాంటి విద్యుత్ అవాంతరాల లేకుండా శాస్త్రసాంకేతిక పరిశోధనలు కొనసా గించాలన్నా అనుక్షణం విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రాణాధార ఉపకరణాలకూ విద్యుత్ ఖచ్చితంగా అవసరం. అందుకే ఐదేళ్ల లోపే అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేయా లని నాసా భావిస్తోంది. కేంద్రక విచ్ఛిత్తి (న్యూక్లియర్ ఫిజన్) సూత్రంపై పనిచేసే అణుప్లాంట్‌ను అక్కడ నెలకొల్పనున్నారు. అయితే నాసాకు పోటీగా సొంత అణువిద్యుత్ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని చైనా, రష్యాలు సైతం ప్రకటించాయి. మరో పదేళ్లలో ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేస్తామని ఇప్పటికే వెల్లడించాయి.

### అణు విద్యుతే ఎందుకు?

చందమామపై స్థిరనివాసం ఏర్పర్చుకునే వ్యోమగాముల నిరంతర విద్యుత్ అవసరా లను సౌరవిద్యుత్ ఏమాత్రం తీర్చలేదు. ఎందుకంటే చంద్రునిపై ప్రతిరోజూ సూర్యకాంతి ప్రసారం కాదు. 14 రోజులపాటు ఏకధాటి గా ఎండకాచి తర్వాత 14 రోజులపాటు మైనస్ డిగ్రీ సెల్సియస్ స్థాయిలో చిమ్మచీకటి నెలకొంటుంది. ఈ చీకటిమయ రోజుల్లో విద్యుత్ అవసరాలు తీర్చే ఏకైక ప్రత్యామ్నాయంగా అణువిద్యుత్‌కేంద్రం నిలుస్తోంది. అందుకే ఎంత ఖర్చయినాసరే వ్యయప్రయా సల కోర్చి చంద్రునిపై న్యూక్లియర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నాసా కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదన లకు సైతం పచ్చజెండా ఊపింది. మరో ఐదేళ్లలో అక్కడ అణువిద్యుత్ ప్లాంట్ కలను సాకారంచేయాలని కంకణం కట్టుకుంది.

### చిన్నస్థాయిలో మొదలెట్టి

అణువిద్యుత్ కేంద్రంలో ఏవైనా ప్రమాదాలు సంభవించినా అక్కడ శూన్యం ఉంటుందికనుక రేడియోధార్మికత అంతటా వ్యాపిస్తుందన్న భయం అక్కర్లేదు. థర్మల్, జల, పవన విద్యుత్‌లతో పోలిస్తే చందమామపై అణువిద్యుత్ మాత్రమే ఆచరణ సాధ్యమవుతుంది. సౌరఫలకాలతో సూర్యకాంతిని ఒడిసిపట్టి సౌర విద్యుత్‌ను తయారుచేసినా అది అక్కడి వ్యోమగాముల అవసరాలను ఏమాత్రం తీర్చలేదు. వీటిని పరిగణనలోకి తీసుకుని న్యూక్లియర్ ప్లాంట్ వైపు శాస్త్రవేత్తలు మొగ్గుచూపుతున్నారు. తొలుత కేవలం 100 కిలోవాట్ల విద్యుత్‌ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నెలకొల్పనున్నారు. భూమి మీద అయితే ఇదే 100 కిలోవాట్ల విద్యుత్‌తో 80 గృహాల విద్యుత్‌అవసరాలు తీర్చొచ్చు. దశలవారీగా ప్లాంట్‌ను విస్తరించి గణనీయమైన స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తారు.

### సమస్యలెన్నో..

.జల, థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లతో పోలిస్తే అణువిద్యుత్ ప్లాంట్‌కు పెద్దగా భూవిస్తీర్ణంతో పనిలేదు. కానీ చంద్రుని మీదకు ఈ మొత్తం అణువిద్యుత్ వ్యవస్థ ఉపకరణాలను మోసుకెళ్లాలంటే చాలా చాలా కష్టం. పైగా ఇవి రాకెట్‌లో తరలించేంత తేలికగా ఉండాలి. అత్యధిక బరువులను ఇప్పుడున్న రాకెట్లు అస్సలుమోయలేవు. ఒకవేళ అధిక బరువులను మోసుకెళ్లేలా వ్యోమనౌకలను డిజైన్‌చేసి రూపొందించినా అవి అంత బరువును మోస్తూకూడా జాగ్రత్తగా చంద్రునిపై ల్యాండ్ కావాల్సి ఉంటుంది. ఏమాత్రం తేడా వచ్చి అది క్రాష్ ల్యాండ్ అయినా వేలకోట్ల రూపాయల నష్టం ఖాయం. భూమిపై అయితే అణువిద్యుత్ కేంద్రాన్ని ఎంతో మంది సాంకేతిక నిపుణులు తీరిగ్గా, నిశితంగా తనిఖీచేసి నిర్మిస్తారు. చంద్రునిపై ఈ ప్లాంట్‌ను నిర్మించాలంటే కార్మిక సిబ్బంది దొరకరు. ఉన్న ఆ కొద్దిపాటి వ్యోమగాములే అణుప్లాంట్ ఉన్నతాధికారుల అవతారమెత్తి ప్లాంట్‌ను బిగించాల్సి ఉంటుంది. అణువిద్యుత్ ప్లాంట్ నుంచి అత్యధిక స్థాయిలో వేడిమి వెలువడుతుంది. దానికి చల్లబరిచే కూలింగ్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలి. వాటిని కూడా భూమి మీద నుంచే ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఎంతో శ్రమ, వ్యయంతో కూడిన వ్యవహారం. శూన్యస్థితిని తట్టుకునేలా వినూత్న రీతిలో ప్లాంట్‌ను డిజైన్ చేయాల్సి ఉంటుంది. రేడియోధార్మిక వ్యర్థాల పారబోత, ప్లాంట్ పాడైతే రిపేర్లు వంటి ఎన్నో అవరోధాలు అక్కడి హఠాత్తుగా స్వాగతం పలుకుతాయి.వీటిని తట్టుకుంటూనే ప్లాంట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. ట్రంప్ హయాంలో నాసాకు అంతరిక్ష పరిశోధనా బడ్జెట్‌లో భారీ కోత పెట్టిన నేపథ్యంలో ఇతర మార్గాల్లో ఆదాయం సమకూర్చి ఈ ప్రాజెక్ట్‌ను సఫలీకృతం చేయాల్సి ఉంది. ఇన్ని బాలారిష్టాలను దాటుకుని ప్లాంట్ ఏర్పాటు సుసాధ్యమైతే జాబిలిపై మానవనివాసం ఎలాంటి జంజాటాలు లేకుండా హాయిగా సాగుతుంది.

## మూడవసారి ఉత్తమ అవార్డు అందుకున్న జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి - గన్నవరం వాసి దేవరపల్లి విక్టర్ బాబు..



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేసిన ఉత్తమ ఉద్యోగులకు శుక్రవారం మచిలీపట్నంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నందు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా డి.విక్టర్ బాబు ముడోవ సారి ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రం పొందారు. ఈయన గతంలో 2016 లో అప్పటి జాయింట్ కలెక్టర్ గంధం చంద్రుడు చేతుల మీదుగా మొదటిసారి ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రాన్ని పొందారు.అనంతరం గత జనవరి లో గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని పొందారు. మరలా నేడు అనగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు.విక్టర్ బాబు ఉపాధి కల్పన శాఖలో ప్రభుత్వ విధానాలను అనుసరించి యువతకు మార్గదర్శకాలను రూపొందించుకుని ప్రభుత్వం తరుపున జిల్లావ్యాప్తంగా అనేక ప్రయివేటు సంస్థలతో సయోధ్య కుదుర్చుకుని జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ను సమన్వయం చేసుకుని జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో విరివిగా జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహిస్తూ అటు కృష్ణాజిల్లా ఇటూ ఎన్టీయార్ జిల్లాలకు ఉపాధి కల్పన శాఖ బాధ్యతలు నిర్వహిస్తూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో అనేకమంది నిరుద్యోగులకు ప్రయివేటు రంగ సంస్థల్లో ఉపాధి కల్పించే దిశగా ముందుకు సాగారు. అంతేగాక ఇదివరకు అకాల వర్షాలతో ఏర్పడిన వరదలకు సైతం ప్రభుత్వం తన కి అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు .అంతకు ముందు దసరా ఉత్సవాల బాధ్యతలను అప్పగించగా ఎంతో అప్రమత్తంగా బాధ్యతలను సక్రమంగా నిర్వహించారు.మరొక పక్క జిల్లా రెవెన్యూ సదస్సులకు నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టి అట్టి బాధ్యతలను సైతం సమర్థవంతంగా పూర్తి చేశారు.ఇలా ఎన్టీఆర్ , కృష్ణాజిల్లాలో రెండు ప్రాంతాల్లో ఆయన పనిచేసిన శాఖలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ అధికారిగా నిలవడం గమనార్హం.ఈ సందర్భంగా విక్టర్ బాబు మాట్లాడుతూ ప్రజలు,తన తోటి సిబ్బంది, ఉన్నతాధికారుల సహకారంతో అవార్డును దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు .అవార్డు పొందిన విక్టర్ బాబు ను పలువురు అధికారులు, బంధువులు,మిత్రులు , గన్నవరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు , గన్నవరం మానవత స్వచ్ఛంధ సంస్థ శాఖ ప్రతినిదులు ఎంఈఎఫ్ సంఘం సభ్యులు అభినందలను తెలిపారు.

## రామవరప్పాడులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం : యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : నిరుపేద కార్మికుల ఆకలి తీర్చేందుకు రామవరప్పాడు గ్రామంలోనూ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పక్కనే నూతనంగా ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శుక్రవారం సాయంత్రం యార్లగడ్డ టిడిపి నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, రామవరప్పాడు రెండుచోట్ల అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా తొలి విడతలో నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో అన్న క్యాంటీన్ మంజూర అయిందని చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో అన్న ఎన్టీ రామారావు కిలో బియ్యం రెండు రూపాయల పథకాన్ని ప్రవేశపెట్టగా ఆ పథకం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది పేద ప్రజలకు ప్రయోజనం కలిగిందన్నారు. పట్టణంలోని నిరుపేదలు, కూలీలు, కార్మికుల ఆకలి తీర్చేందుకు చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ లను ఏర్పాటు చేశారని ఇవి పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఒక అన్నక్యాంటిన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిశ్చయించిందని వివరించారు. ఈ కాంటీన్ ను నిరుపేద కార్మికులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గోడపాటి తులసి మోహన్ సెక్రటరీ బోడపాటి రవి, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, చీమాట రవి వర్మ, టిడిపి నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఆరుమళ్ళ కృష్ణారెడ్డి,దయ్యాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయి కళ్యాణి, మేడేపల్లి రమ, గన్నవరం పట్టణ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్, మద్దినేని వెంకటేశ్వరరావు , కొమ్మరాజు సుధీర్, కసారినేని రంగబాబు, పడమట రంగారావు, బస్సే నాగా ప్రసాద్, బస్సే సరిత, తీరివిధి నరేష్, అన్నే జ్యోతి, మహ్మద్ రఫీ, తంగిరాల శ్రీనివాసరావు, జస్థి తాతరావు, చాలాసాని సత్యనారాయణ,నాదెండ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 5000 రూ. ఆర్థిక సహాయం అందజేసిన శెట్టి రాజేష్ విష్ణువర్ధన్ రెడ్డి



నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం ఆగస్టు 16 శుభోదయం న్యూస్: బిజినపల్లి మండలం నంది వడ్డేమాన్ గ్రామానికి చెందిన డొక్కా చంద్రమ్మ భర్త నర్సింహ వయసు 55 రాత్రి అన్నం తింటుంటే గొంతులో అన్నం అడ్డపడి మరణించారు. ఈమెకు ఇద్దరు కూతుళ్లు విషయం తెలుసుకున్న శెట్టి రాజేష్ , విష్ణువర్ధన్ రెడ్డి, వారికి 5000 రూపాయలు సహాయం చేయడం జరిగింది. శెట్టిరాజేష్ మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు పాల్గొనాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి డొక్కా చెన్నయ్య కుందేటి ఉసేన్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినపల్లి మండల్ లో ఘనంగా 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు



నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం ఆగస్టు 16 శుభోదయం న్యూస్: మండలంలోని వివిధ ప్రాథమికున్నత ,ఉన్నత పాఠశాలలో 79వ స్వతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు నాయనోళ్ళ బాలరాజు గౌడ్ జాతీయ జెండాను ఎగరవేశారు పిఎసిఎస్ డైరెక్టర్లు కార్యాలయంలో స్వతంత్ర దినోత్సవ ఘనంగా నిర్వహించుకున్నారు మండల పంచాయతీ కార్యాలయం లో ఎంపీడీవో కథలప్ప. ఐకెపిభవనంలో ఏపీఎం ఉదయ్ కుమార్ మండల వ్యవసాయ కార్యాలయంలో ఇన్చార్జి. ఏవో కమల్ కుమార్ పోలీస్ స్టేషన్ లో తాసిల్దార్ కార్యాలయం లో తాసిల్దార్ మునిరోద్దీన్ జాతీయ జెండా ఎగురవేశారు వివిధ ప్రవేట్ పాఠశాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో కూడా విద్యార్థులు స్వతంత్రం కోసం పోరాడిన దేశ నాయకుల రూపంలో ఆకార వస్త్రాలు ధరించి వీధి వీధినా దేశభక్తిని చాటారు దీనిలో భాగంగా మండల పరిధిలోని లట్టుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2024 ఏ- 2025 పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 500 కు పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి 5000 రూపాయలు చొప్పున 20వేల రూపాయలు ఆర్థిక ప్రోత్సాహం క్రింద ప్రవీణ్ కుమార్ రెడ్డి బహుమతులుగా ఇచ్చారు.జరిగింది పాఠశాల ప్రధాన పాధ్యాయులు తిరుపతయ్య ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు కవచం శ్రీనివాస్ రెడ్డి టి వెంకట్ రెడ్డి యుగంధర్ రెడ్డి ఉపేందర్ రెడ్డి శ్రీశైలం గ్రామ ప్రజలు పాల్గొన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ లట్టుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామా చెందిన విశ్రేంత ఎస్బిఎన్ స్వామి విశ్రాంత డిటిఓ రాములు స్వతంత్ర దినోత్సవం లో భాగంగా విద్యార్థులకు టైం బెల్టులు ఇతర విద్య వస్తువులను అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహాలు ఇచ్చినచో ముందు ముందు విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు మొత్తం 50 వేల విలువైన విద్య మెటీరియల్స్ ను పంపిణీ చేసినట్లు తెలిపారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య ఉపాధ్యాయులు సాయి జ్యోతి, శ్రీదేవి సునీతమ్మ విద్యార్థుల తల్లిదండ్రులు వితరణ చేసిన వారిని అభినందించి ఘనంగా సన్మానించారు.

## ఉత్తమ తహసిల్దార్ గా బాపట్ల తహసిల్దార్ షలీమా



(శుభోదయం న్యూస్) బాపట్ల జిల్లా: రెవిన్యూ శాఖలో ప్రజలకు అందిస్తున్న సేవలు గాను ఉత్తమ తహసిల్దార్ గా బాపట్ల జిల్లా కలెక్టర్ బాపట్ల తహసిల్దార్ షలిమా ను ఎంపిక చేశారు. స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన వేడుకలలో తహసిల్దార్ షలీమాకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి, బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు, చీరాల ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా ఉత్తమ తహసిల్దార్ గా ప్రశంసా పత్రాన్ని తహసిల్దార్ కు అందజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలందించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు మరెన్నో అవార్డులు పొందాలని ఆమెను అభినందించారు.